తెలంగాణ కోసం పనిచేసేది బీఆర్ఎస్సే..


సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

- జాతీయ పార్టీలతో ఏం లాభంలేదు
- 10 ఏండ్ల సంక్షేమాన్ని ప్రజలకు వివరించండి
- బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తేనే పార్లమెంట్‌లో తెలంగాణ వాణి వినిపిస్తారు
- మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- కొత్తూరు పాప్రస్ పోర్టులో ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశం

కొత్తూరు, ఏప్రిల్ 14 : జాతీయ పార్టీలతో తెలంగాణకు ఎలాంటి లాభంలేదని బీఆర్ఎస్ మాత్రమే ఈ ప్రాంత ప్రజల కోసం పనిచేస్తుందని బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి కొత్తూరు మండల ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని కొత్తూరు పాప్రస్ పోర్టులో ఆదివారం నిర్వహించారు. దీనికి ఎంపీ అభ్యర్థితో పాటు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎంపీగా గెలిచిన తర్వాత షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎంతో మందికి ఉపాధి కల్పించినట్లు చెప్పారు. కేసీఆర్ హయాంలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని.. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని.. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులతోపాటు అన్ని వర్గాల వారు ఇబ్బందిపడుతున్నారన్నారు. నీరు లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆరోపించారు. మరోసారి తనను ఆశీర్వదించి.. గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఆయన తెలిపారు.

గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలిస్తేనే పార్టీకి.. క్యాడర్‌కు బంగారు భవిష్యత్ ఉంటుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ వాణి పార్లమెంట్‌లో వినిపిస్తారన్నారు. రానున్న సర్పంచ్, ఎంపీటీసీ ఇతర ఎన్నికల్లోనూ మంచి ఫలితాలు వస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను పథకాల అమలుపై నిలదీయాలని సూచించారు. గతంలో కొన్ని తప్పులు జరిగిన మాట వాస్తవమేనని.. మరోసారి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలి

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని.. ప్రభుత్వాన్ని నడపడం వారికి చేతకావడంలేదని విమర్శించారు. రూ.7,500 కోట్లను రైతు బంధు కోసం కేసీఆర్ ట్రెజరీల్లో జమచేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు పంచిపెట్టిందని ఆరోపించారు. మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్ నియోజవర్గంలో బీఆర్ఎస్ బలంగా ఉందన్నారు. కార్యకర్తలు నెల రోజులపాటు అలుపెరుగకుండా ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరిని కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించాలని ఆయన సూచించారు.

సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేశ్, జడ్పీటీసీ శ్రీలత, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కొత్తూరు, నందిగామ మండలాల అధ్యక్షులు కృష్ణయాదవ్, పద్మారావు, నాయకులు దేవేందర్‌యాదవ్, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, విఠల్, నారాయణరెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

21 నుంచి ప్రయోగ తరగతులు ప్రారంభం

వికారాబాద్, ఏప్రిల్ 14 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ మొదటి సంవత్సరం సైన్స్ చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 21 నుంచి ప్రయోగ తరగతులు ప్రారంభం అవుతాయని వికారాబాద్ అనంత పద్మనాభ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మందారిక, సమన్వయకర్త మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల, కులకచర్ల, కొడంగల్, తాండూరు, వికారాబాద్ సార్వత్రిక అధ్యయన కేంద్రాల సైన్స్ విద్యార్థులకు ప్రయోగ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం, కంప్యూటర్ అప్లికేషన్స్, సబ్జెక్టులు చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ప్రయోగ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. విద్యార్థులు తరగతులకు తప్పనిసరిగా అడ్మిట్ కార్డ్, ఫీ రశీదుతో హాజరు కావాలని సూచించారు. కనీసం 75% హాజరులేని విద్యార్థులను ప్రయోగ పరీక్షలకు అనుమతించబడరని తెలిపారు. ప్రయోగ తరగతులు ఈ నెల 21 నుంచి మే 2 వరకు ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు స్థానిక అధ్యయన కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9440512625ను సంప్రదించాలని వారు సూచించారు.

ఆదర్శప్రాయుడు అంబేద్కర్

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎస్పీ, మాజీ ఎమ్మెల్యే తదితరులు


నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, ఏప్రిల్ 14 : ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని తెలంగాణ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా వికారాబాద్‌లో సాంఘికక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. ప్రపంచంలోనే ఉత్తమమైన రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన గొప్ప మహనీయుడని, వారి జీవితం మనకందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ, అభివృద్ధి అధికారి మల్లేశం, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ జాకీర్ అహ్మద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజస్, ఏఎస్‌డబ్ల్యూ ఉమాపతి, ఆయా పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు

కరపత్రాలు, గోడ ప్రతుల ఆవిష్కరణ

అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో కరపత్రాలు, గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు అవసరమని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలు, గోడ ప్రతులను కలెక్టర్ శశాంక ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాల నివారణకు అప్రమత్తతతో కూడిన ముందు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గోదాములు, షాపింగ్ మాల్స్, పాఠశాలలు, సినిమా థియేటర్లు, ఆసుపత్రులు వంటి ప్రదేశాల్లో ప్రమాదాలు జరుగకుండా యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం కాగా.. వారం రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారులు పూర్ణచంద్రారావు, శ్రీనాథ్, నాగేశ్వరరావు, చంద్రానాయక్, జగన్, బలరాం, రాకేశ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి

- భూగర్భ జలాలు అడుగంటడంతో బోరుబావుల్లో తగ్గిన నీరు
- రైతులు పక్క పొలాల నుంచి సాగునీటిని పైపుల సాయంతో తీసుకోవాలి
- మంబాపూర్ క్లస్టర్‌లో ఎండిన పంటలను పరిశీలించిన మంబాపూర్ క్లస్టర్ ఏఈవో బాలకోటేశ్వర్లు


ఎండిపోయిన వరి పొలాన్ని రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఏఈవో బాలకోటేశ్వర్లు

పెద్దేముల్, ఏప్రిల్ 14 : భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లలో నీరు సరిగా రాని, విద్యుత్ సమస్యలతో వరి పంటలు ఎండిపోయిన రైతులు మిగతా పంటను కాపాడుకోవడానికి అందుకు కావాల్సిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చూసుకోవాలని మంబాపూర్ క్లస్టర్ ఏఈవో బాలకోటేశ్వర్లు రైతులకు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని మంబాపూర్ వ్యవసాయ క్లస్టర్ పరిధిలో ఎండిపోయిన వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంబాపూర్ క్లస్టర్‌లో దాదాపు మూడున్నర ఎకరాల వరకు వరి పొలాలు ఎండిపోయాయని, రైతులు పక్క పొలంలో ఉన్న బోరు మోటర్ల సహాయంతో పైపుల ద్వారా మిగతా వరి పంటను కాపాడుకోవాలని సూచించారు. ఆయన వెంట స్థానిక రైతులు ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట, ఏప్రిల్ 14 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం దుద్యాల మండలంలోని గౌరారంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, మహిళలకు నెలకు రూ.2500 చెల్లిస్తామని, కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం, రైతు భరోసా కింద రూ.15వేలు పెట్టుబడి సహాయం అందిస్తామని, రైతులకు రూ.500 బోనస్, పింఛన్లు నెలకు రూ.4వేలు అందజేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వంద రోజుల్లోనే తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందన్నారు. రైతు బంధు సహాయం కూడా రైతులకు సక్రమంగా పంపిణీ చేయలేదని నరేందర్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ అసమర్థత కారణంగా విద్యుత్, నీటి సమస్యలు తలెత్తాయని ఆరోపించారు.

ఎంపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే కరువు వచ్చిందని, సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ప్రభుత్వంపై రైతులు, ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత కారణంగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అనేక స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మూడో స్థానమే దిక్కని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలు, రైతుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎంపీ అభ్యర్థి విజయానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం కోస్గి పట్టణంలో నిర్వహించే ఎన్నికల సన్నాహక సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఫార్మా కంపెనీని అడ్డుకుంటాం

దుద్యాల మండలంలోని దుద్యాల, పోలేపల్లి, హకీంపేట, లగచెర్ల గ్రామాల పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేయదలచిన ఫార్మా విలేజ్‌ను అడ్డుకుంటామని నరేందర్‌రెడ్డి అన్నారు. ఫార్మా విలేజ్ ఏర్పాటు వల్ల రైతులు భూములు కోల్పోయి నష్టపోతారని, కాలుష్యం ఏర్పడుతుందని.. ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని రాకుండా చూస్తామన్నారు. ప్రజలు, రైతులతో కలిసి ధర్నాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ దుద్యాల, బొంరాస్‌పేట మండలాల అధ్యక్షులు చాంద్‌పాషా, యాదగిరి, మాజీ వైస్ ఎంపీపీలు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ తిరుపతయ్య, నాయకులు మహేందర్‌రెడ్డి, మహేందర్, సోంనాథ్, నెహ్రూనాయక్, అబ్దుల్ వాహబ్, సలాం పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన కార్యకర్తలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించిన అధికారులు

మరమ్మతులు చేశారు.. కష్టాలు తీర్చారు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్ ఏర్పాటు చేసిన అధికారులు
- విద్యుత్ సమస్య తీరడంతో రైతుల ముఖాల్లో చిరునవ్వులు

పెద్దేముల్, ఏప్రిల్ 14 : వరి రైతుల విద్యుత్ సమస్య పరిష్కారం కావడంతో వారి ముఖాల్లో చిరునవ్వులు చిందాయి. మంబాపూర్‌లో ఇదివరకు ట్రాన్స్‌ఫార్మర్‌కు సరైన మరమ్మతులు చేయక.. ఎర్తింగ్ ఇవ్వకపోవడంతో లోఓల్టేజీ సమస్యతో మోటర్లు కాలిపోయేవి. పంటలకు నీరందక ఎండిపోయాయి. వరి పంటను పండిస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పలు దినపత్రికలతోపాటు 'నమస్తే తెలంగాణ' దినపత్రిక ప్రధానంగా 'కరెంటు కష్టం..పంట నష్టం' అనే శీర్షికతో ఈ నెల 12న వరి రైతుల కష్టాలను ఎత్తిచూపుతూ క్లుప్తంగా ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి వార్తా కథనం వచ్చిన రోజే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. లోఓల్టేజీ సమస్యను కూడా పరిష్కరించారు. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను ఎత్తిచూపిన పత్రికలకు, సమస్య పరిష్కరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో మోటర్లు మంచిగా నడుస్తున్నాయని.. పంటలకు నీరు అందించగలుగుతున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా సమస్య పరిష్కరించబడినప్పటికీ కూడా మంబాపూర్ గ్రామంలో రైతులకు విద్యుత్ సమస్యలు అంటూ కొంతమంది సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకుల సందడి

ధారూరు, ఏప్రిల్ 14 : ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు కోట్‌పల్లి ప్రాజెక్టుకు తరలివచ్చారు. సందడి చేశారు. ప్రాజెక్టులో బోటింగ్ చేసేందుకు బోటింగ్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. బోటింగ్ చేసేందుకే కాకుండా ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపారు. వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఉదయం ప్రాజెక్టుకు చేరుకొని సాయంత్రం వరకు ఇక్కడే ఉండి కుటుంబసమేతంగా భోజనాలు చేశారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు.

మొబైల్ యాప్ నుంచే విద్యుత్ సేవలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ): కొత్త విద్యుత్ కనెక్షన్ కావాలన్నా.. పేరు మార్పు చేసుకోవాలన్నా... లోడ్ ఛేంజ్ చేసుకోవాలన్నా... ఇలా సేవ ఏదైనా ఇంట్లోంచి కాలు కదపకుండానే మొబైల్ యాప్ నుంచే సేవలను పొందేలా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్‌పీడీసీఎల్) శ్రీకారం చుట్టింది. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకుంటోంది. టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ స్వీయ పర్యవేక్షణలో అప్‌డేటెడ్ వెర్షన్‌లో మొబైల్ యాప్‌ను వాడుకలోకి తీసుకువచ్చారు. విద్యుత్ వినియోగదారులు తమ బిల్లుల చెల్లింపు, విద్యుత్ వాడకం, హిస్టరీ తెలుసుకోవడంతో పాటు సరఫరాలో ఉండే సమస్యల పరిష్కారం, విద్యుత్‌లో అంతరాయం, వోల్టేజ్ హెచ్చు తగ్గులు, మీటర్ సమస్యలు, కొత్త మీటర్ మంజూరు, బిల్లింగ్ సమస్యలు, నూతన సర్వీసుల కేటగిరిలో గ్రీన్ టారిఫ్, సోలార్ రూఫ్ టాప్ దరఖాస్తు వంటి వాటిని జోడించారు. వీటితో పాటు పేరు మార్పు, చిరునామా మార్పు, కేటగిరి మార్పు, అదనపు లోడ్, లైన్ షిఫ్టింగ్ వంటి వాటిని మొబైల్ యాప్ ద్వారా పొందేలా దీన్ని రూపొందించామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత యూఎస్సీ నంబరు నమోదు చేయడం ద్వారా అన్ని రకాల సేవలను పొందేలా దీన్ని రూపొందించారు.

మొబైల్ యాప్ నుంచే ఫిర్యాదులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తినా, ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లు సమాచారం ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేలా యాప్‌ను రూపొందించారు. విద్యుత్ చార్జీలకు సంబంధించిన టారిఫ్ వివరాలు, భద్రతకు సంబంధించిన సూచనలను అరచేతిలోని మొబైల్ యాప్ నుంచే సులభంగా పొందేలా టీఎస్ఎస్‌పీడీసీఎల్ యాప్‌ను ఆధునీకరించి అందుబాటులోకి ఉంచారు. దాదాపు పది లక్షల మంది వినియోగదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వినియోగిస్తున్నామని అధికారులు తెలిపారు. మొత్తంగా అరచేతిలోనే విద్యుత్‌కు సంబంధించిన సమగ్ర సమాచారం, సేవలను పొందేలా ఈ యాప్‌ను ఆధునీకరించారు. మొబైల్ యాప్‌తో పాటు వెబ్‌సైట్‌లోనూ ఆన్‌లైన్ సేవలను సులభంగా పొందవచ్చని అధికారులు తెలిపారు.